మహిళా ఉద్యోగులకు కౌన్సెలింగ్

శ్రీరాంపూర్, నవంబర్ 11 : శ్రీరాంపూర్ ఆర్కే 5, 7 గనుల్లో పనిచేస్తున్న మహిళా బదిలీ వర్కర్లు, జనరల్ మజ్దూర్లకు సర్ఫేస్‌లో 16 డిజిగ్నేషన్లలో ఉద్యోగాలు కల్పించేందుకు సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. కమిటీ సభ్యుడు, ఇన్‌చార్జి ఎస్‌వోటూ జీఎం శ్రీధర్‌రావు, డీవైజీఎం అరవిందరావు, చిరంజీవులు ప్రక్రియ కొనసాగించారు. ఈ కార్యక్రమంలో డీవైసీఎంవో డాక్టర్ రమేశ్, ఆర్కే 5 మేనేజర్ సుధీర్ కుమర్, ఆర్కే 7 సీనియర్ పీవో ప్రదీప్‌గౌడ్, సంతన్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న కుట్టు శిక్షణ

రెబ్బెన, నవంబర్ 11 : రెబ్బెన మండలం గోలేటి గ్రామంలో న్యాక్ ఆధ్వర్యంలో ప్రారంభమైన కుట్టు శిక్షణ కొనసాగుతున్నదని టీచింగ్ ఫ్యాకల్టీ ముక్తేశ్వరి తెలిపారు. 3 నెలల ఉచిత శిక్షణ అందించిన అనంతరం అర్హత సాధించిన వారికి రూ.10 వేల విలువ గల కుట్టు మిషన్‌తో పాటు, కిట్, సర్టిఫికేట్ అందించనున్నట్లు పేర్కొన్నారు. నిరుద్యోగ మహిళలు, యువతులు స్వయం ఉపాధి రంగంలో రాణించాలనే లక్ష్యంతో అందిస్తున్న శిక్షణ వారి భవిషత్‌కు భరోసా కల్పిస్తుందని తెలిపారు.

గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్

గైర్హాజరు కార్మికులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న పీవో శ్రీనివాస్

శ్రీరాంపూర్, నవంబర్ 11 : శ్రీరాంపూర్ ఓసీపీ, ఆర్కే 5 గనులపై సోమవారం గైర్హాజరు కార్మికులకు అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఓసీపీపై పీవో శ్రీనివాస్, వెల్ఫేర్ ఆఫీసర్ శంకర్.. గైర్హాజరు ఉద్యోగులు, వారి కుటుంబాలకు ఉద్యోగం విలువ వివరించారు. అలాగే ఆర్కే 5గనిపై మేనేజర్ సుధీర్ కుమార్, ఏజెంట్ శ్రీధర్.. 30 మంది గైర్హాజరు కార్మికులు, వారి కుటుంబాలకు కౌన్సిలింగ్ నిర్వహించి, గైర్హాజరుకు గల కారణాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సేఫ్టీ ఆఫీసర్ రాందాస్, సీనియర్ పీవో రణదీప్‌గౌడ్, అదనపు మేనేజర్ శివయ్య, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి నర్సింగారావు, యాక్టింగ్ పీ శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ గ్రామ సభ

వాంకిడి, నవంబర్ 11 : మండలంలోని పిప్పర్‌గొందిలో సోమవారం ఈజీఎస్ ఏపీవో శ్రావణ్‌కుమార్ అధ్యక్షతన ఉపాధి హామీ గ్రామసభ నిర్వహించారు. ఎంపీడీవో వీ ప్రవీణ్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ 100 రోజుల పని కల్పించాలన్నారు. అనంతరం పిప్పర్‌గొంది, పాటగూడల్లో సర్వేను పరిశీలించారు. ఈసీ మోసిన్, టీఏ అంబాజీ, కార్యదర్శులు నియమాలిక, అన్నపూర్ణ, రైతులు తదితరులు ఉన్నారు.

ఔషధ గిడ్డంగి ఇన్‌చార్జిగా శ్రీవాణి

మంచిర్యాల అర్బన్, నవంబర్ 11 : తెలంగాణ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎంఎస్ఐడీసీ) ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ డ్రగ్ స్టోర్ (ఔషధ గిడ్డంగి) ఇన్‌చార్జిగా శ్రీవాణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లో కరీంనగర్ డీసీహెచ్ కార్యాలయంలో పని చేస్తున్న శ్రీవాణిని మంచిర్యాల డ్రగ్ స్టోర్ ఇన్‌చార్జిగా నియమించారు.

బతికుండగానే చనిపోయినట్లు అఫిడవిట్

- రెవెన్యు అధికారుల సహకారంతో లావని పట్టా పేరుమార్పిడి
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన
- తమ భూమి ఇప్పించాలని బాధితురాలి వినతి

బాధితురాలు బొద్దున రాజమ్మ

జైపూర్, నవంబర్ 11: బతికుండగానే చనిపోయినట్లుగా అఫిడవిట్ సృష్టించి లావని పట్టా భూమిని ఇతరుల పేరున రిజిస్ట్రేషన్‌చేసిన ఘటన జైపూర్ తహశీల్దార్ కార్యాలయంలో ఆలస్యంగా వెలుగుచూసింది. సీసీసీ నస్పూర్ ప్రాంతంలో నివాసముండే బొద్దున రాజమ్మకు జైపూర్ మండలం మద్దులపల్లి శివారులో సర్వే నం 33/3లో 2.10 ఎకరాల లావని పట్టా భూమి ఉంది. వ్యక్తి గత అవసరాల కోసం రెండేళ్లక్రితం సమీప బంధువుల ద్వారా రెండు ఎకరాలను కామ నర్సింగం అనే వ్యక్తికి అమ్మారు. అయితే లావనిపట్టా భూమి కావడం.. ఇతరుల పేరున పట్టామార్పిడి చేయరాదు. పట్టాదారు తదనంతరం మాత్రమే కుటుంబ సభ్యుల పేరున మార్పిడి చేయచ్చనే నిబంధనలున్నాయి. దీంతో కొనుగోలుదారు తమ పేరున రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అప్పటి రెవెన్యు అధికారులను ఆశ్రయించారు. వారి సహకారంతో పట్టాదారు చనిపోయినట్లుగా నకిలీ అఫిడవిట్ సృష్టించి ధరణిలో తన పేరున మార్చుకున్నారు. ఈ తతంగమంతా 2022 అక్టోబర్ 22న జరిగింది. అయితే పట్టాదారు రెండెకరాలు అమ్మితే రెండెకరాల పది గుంటల భూమి మార్చుకోవడంతో అసలు విషయం బయటకు వచ్చింది. రెండెకరాలు పోను తన పేరున ఉన్న 10 గుంటలు చూపించడంలేదని మీ సేవల చుట్టూ తిరగడంతో అసలు విషయం బయటకు వచ్చింది. ధరణిలో విరాసత్ చేయాలంటే తహశీల్దార్ కార్యాలయం నుంచి ఇచ్చిన డెత్ సర్టిఫికెట్‌తో పాటు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌లుండాలన్న నిబంధనలున్నా కాసులకు కక్కుర్తి పడి అఫిడఫిట్‌తో సరిపుచ్చుకుని అక్రమ రిజిస్ట్రేషన్ చేశారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు విచారణ చేపడితే దీని వెనుకు ఎంతమంది ఉన్నారనే విషయం బయటపడుతుంది. కాగా, ఈ విషయంపై ప్రస్తుత తహశీల్దార్ వనజారెడ్డిని వివరణ కోరగా పట్టాదారు చనిపోయినట్లుగా నకిలీ ధ్రువపత్రాలు, అఫిడవిట్ సృష్టించి కామనర్సింగం అనే వ్యక్తి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న విషయం వాస్తవమేనన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు ప్రస్తుతం ఈ సర్వేనంబర్‌ను బ్లాక్ చేశామని తెలిపారు. కాగా, మోసపూరితంగా పట్టామార్పిడి చేసుకున్న వారిపై చర్యలు తీసుకుని తమభూమి తమకు ఇప్పించాలని బాధితురాలు బొద్దుల రాజమ్మ పేర్కొన్నారు. ఏప్రిల్‌లో జరిగిన ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తే ఇంతవరకు అధికారులు విచారణ చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

మున్సిపల్ కార్యాలయంలో వినతి అందజేస్తున్న వ్యాపారులు

దుకాణాలు తొలగించాలి

లక్షెట్టిపేట, నవంబర్ 11 : లక్షెట్టిపేట మున్సిపాలిటీ ఊత్కూర్ చౌరస్తాలో వ్యాపార సముదాయాలకు అడ్డంగా ఉన్న చిరు వ్యాపారుల దుకాణాలు, బండ్లను తొలగించాలని కోరుతూ మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందికి సోమవారం వ్యాపారులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యాపారులు బానేశ్, రవి, సతీశ్, రఘు, శ్రీనివాస్, శివ తదితరులు పాల్గొన్నారు.

14న జోనల్‌స్థాయి వాలీబాల్ బాలికల ఎంపిక పోటీలు

నస్పూర్, నవంబర్ 11 : మంచిర్యాల జిల్లా రెబ్బెనపల్లిలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఈ నెల 14న ఉదయం 9గంటలకు అండర్–14 జోనల్‌స్థాయి వాలీబాల్ (బాలికల)ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ఫణిరాజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు 99512 46104 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

లక్షెట్టిపేట, నవంబర్ 11 : మండలంలోని జెండావెంకటాపూర్‌లో ఆర్ఎంపీగా పనిచేసే లచ్చిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. సోమవారం వివిధ జిల్లాల నుంచి ఆర్ఎంపీ సంఘం నాయకులు, స్థానిక ఆర్ఎంపీలు ఆయన నివాసంలో చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.10వేల సాయం అందించారు. రాష్ట్ర నాయకులు పంగ మల్లేశం, మిట్టపల్లి రాజమౌళి, బెజ్జంకి రవీందర్, మనోహర్, రాజన్న సిరిసిల్ల, మంచిర్యాల జిల్లాల అధ్యక్షులు దాసి రాజమల్లు, కొటిరెడ్డి, రాంచందర్, రమేశ్, రాజలింగు, మొండయ్య, సత్యనారాయణ, భీమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి పరామర్శ

మందమర్రి రూరల్, నవంబర్ 11 : ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఫీల్డ్ అసిస్టెంట్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఈద లింగయ్యను జాతీయ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు గజ్జెల్లి లక్ష్మణ్ పరామర్శించారు. సోమవారం పొన్నారం గ్రామంలోని బాధితుడి ఇంటికి వెళ్లి, వివరాలు తెలుసుకున్నారు. ఆధైర్య పడవద్దని, కుల సంఘం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో జాతీయ మాల మాహానాడు మండల టౌన్ అధ్యక్షుడు దాసరి రాములు, నాగుల దుర్గయ్య, బండ రవి, గడ్డం శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

బీసీ, ఓబీసీ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నిక

శ్రీరాంపూర్, నవంబర్ 11 : శ్రీరాంపూర్ ఆర్కే 5, 6 గనులపై సోమవారం నిర్వహించిన సింగరేణి కాలరీస్ బీసీ, ఓబీసీ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశంలో కమిటీని నియమించారు. కన్వీనర్లుగా పంచెర్పుల నరేశ్ కారుకూరి నగేశ్, కో కన్వీనర్లుగా కొట్టి శ్రీకాంత్, సైదం చిరంజీవి నియమితులయ్యారు. అసోసియేషన్ చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి రమేశ్, కేంద్ర నాయకులు ముసుఖ సమ్మయ్య, పొగాకు రమేశ్, బరుపాటి మారుతి, గొల్ల సంతోశ్, సాయిల శ్రీనివాస్, మహేందర్, నర్సయ్య, కిరణ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

నాణ్యమైన ధాన్యంతోనే మద్దతు ధర

కోటపల్లి, నవంబర్ 11 : రైతులు నాణ్యమైన ధాన్యంతోనే సంపూర్ణ మద్దతు ధర పొందవచ్చునని అదనపు కలెక్టర్ మోతీలాల్ పేర్కొన్నారు. కోటపల్లి మండలం మల్లంపేట రైతువేదికలో ధాన్యం కొనుగోళ్లపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులు పంట కాలం పూర్తయిన తర్వాతనే కోయాలని, కోసిన పంటను ఆరబెట్టిన అనంతరం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా అందుబాటులోనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు, తెలిపారు. పీఏసీఎస్ చైర్మన్ సాంబాగౌడ్, ఇన్‌చార్జి ఏవో మహేందర్, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

తాండూర్, నవంబర్ 11 : తాండూర్ మండలం అచ్చలాపూర్‌లో కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీడీవో శ్రీనివాస్‌తో కలిసి తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్ ప్రారంభించారు. గిర్దావార్ ఎజాజుద్దీన్, పీఏసీఎస్ సెక్రటరీ శ్రీనివాస్, సిబ్బంది అనిల్, వెంకటేశ్ పాల్గొన్నారు.

గూడెంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

గూడెం గుట్టకు పోటెత్తిన భక్తులు

486 సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

దండేపల్లి, నవంబర్11 : దండేపల్లి మండలంలోని గూడెం రమాసహిత ఆలయంలో కార్తీక సందడి నెలకొంది. సోమవారం భక్తులు పోటెత్తారు. స్వామివారిని దర్శించుకున్నారు. ముందుగా పవిత్ర గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. కార్తీక దీపాలు వదిలి, గంగమ్మ తల్లికి పూజలు చేశారు. అనంతరం గుట్ట పైభాగంలో ధ్వజ స్తంభం వద్ద, గుట్ట కింద రావి చెట్టు వద్ద దీపాలు వెలిగించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. 486 జంటలు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించాయి. అనంతరం అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

నాణ్యమైన విద్యను అందించాలి

మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్‌రావు

చెన్నూర్/చెన్నూర్ టౌన్, నవంబర్ 11: పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు మెనూ తప్పని సరిగా పాటించాలని జిల్లా పంచాయతీ అధికారి, మండల ప్రత్యేకాధికారి డీ వెంకటేశ్వర్‌రావు అన్నారు. సోమవారం చెన్నూర్ పట్టణంలోని కస్తూర్బా, సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. డైనింగ్ హాల్, తరగతి గదులు, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆయన తెలిపారు. పాఠశాలలో విద్యార్థులకు అందజేసే భోజనాన్ని, రికార్డులను పరిశీలించారు. సమస్యల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో ఎం మోహన్, ఎంపీవో అజ్మత్ అలీ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్‌రావు

విదర్భలో విజేతదే మహా పీఠం

- ఇక్కడ 62 అసెంబ్లీ నియోజకవర్గాలు
- ఈ ప్రాంతంలో పట్టు సాధిస్తే అధికారం పక్కా
- ప్రత్యేక దృష్టి సారించిన రెండు కూటములు

ముంబై, నవంబర్ 11(నమస్తే తెలంగాణ): మహారాష్ట్ర ఎన్నికలు సమీపిస్తున్న వేళ రెండు కూటములు విదర్భ ప్రాంతంపై ప్రత్యేకంగా దృష్టి సారించాయి. 62 నియోజకవర్గాలు ఉన్న విదర్భలో పాగా వేస్తే అధికారానికి దగ్గరైనట్టే అని కూటములు లెక్కలు వేసుకుంటున్నాయి. ఇక్కడి ప్రజలను ఆకర్షించి మెజార్టీ సీట్లు తమ ఖాతాలో వేసుకోవాలని తీవ్రంగా శ్రమిస్తున్నాయి. ఇప్పటికే రెండు కూటముల నుంచి అగ్రనేతలు విదర్భ మొత్తాన్ని చుడుతూ ప్రచారం చేస్తున్నారు. ఎక్కువగా పత్తి పండించే రైతులు ఉన్న ఈ ప్రాంతంలో రైతులు ఎటువైపు నిలుస్తారనేది గెలుపోటములను నిర్ణయించనుంది.

రెండు కూటములకూ కీలకం

విదర్భలోని మొత్తం 62 స్థానాల్లో బీజేపీ, కాంగ్రెస్ 36 స్థానాల్లో ప్రత్యక్షంగా తలపడుతున్నాయి. 11 జిల్లాలు కలిగిన విదర్భ ప్రాంతం 1990ల వరకు కాంగ్రెస్‌కు కంచుకోట. మూడు దశాబ్దాలుగా ఇక్కడ బీజేపీ – శివసేన కూటమి పట్టు పెంచుకుంది. 2014లో ఇక్కడ బీజేపీ ఒంటరిగా పోటీ చేసి 44 స్థానాలను గెలుచుకుంది. 2019లో 29 స్థానాలకు పడిపోయింది. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం మహా వికాస్ అఘాడీ(ఎంవీఏ) ఇక్కడ మంచి ఫలితాలను సాధించింది. విదర్భలోని 10 లోక్‌సభ స్థానాల్లో ఏడు స్థానాలను కైవసం చేసుకుంది. దీంతో అసెంబ్లీ ఎన్నికల్లో విదర్భలో పాగా వేసేందుకు ఎంవీఏ ప్రయత్నిస్తున్నది. ఆరెస్సెస్ కేంద్ర కార్యాలయం విదర్భలోనే నెలకొని ఉండటం, రాష్ట్ర బీజేపీకి జోడుగుర్రాల్లాంటి దేవేంద్ర ఫడ్నవీస్, చంద్రశేఖర్ బవాంకులే ఈ ప్రాంతానికి చెందిన వారే కావడంతో బీజేపీ ఈసారి విదర్భ ప్రాంతాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నది.

ఇజ్రాయెల్‌పై హెజ్బొల్లా రాకెట్ల వర్షం

90కి పైగా క్షిపణుల ప్రయోగం • పలువురికి గాయాలు • ధ్వంసమైన వాహనాలు

హెజ్బొల్లా రాకెట్ దాడులతో ఇజ్రాయెల్‌లోని హైఫాలో దహనమవుతున్న కార్లు

బీరుట్, నవంబర్ 11: ఇజ్రాయెల్–హెజ్బొల్లా మధ్య పోరు మరింత తీవ్రరూపం దాల్చింది. లెబనాన్‌లోని హెజ్బొల్లా గ్రూప్ సోమవారం ఇజ్రాయెల్‌పై వరుస రాకెట్ దాడులతో విరుచుకుపడింది. ఇజ్రాయెల్ నగరం 'హైఫా' లక్ష్యంగా 90కిపైగా క్షిపణులను ప్రయోగించింది. ఈ దాడుల్లో హైఫాలో పలు భవనాలు దెబ్బతిన్నాయని, పలువురు గాయపడ్డారని, వాహనాలు ధ్వంసమయ్యాయని మీడియా కథనాలు పేర్కొన్నాయి. హెజ్బొల్లా ప్రయోగించిన పలు మిస్సైల్స్‌ను ఇజ్రాయెల్ రక్షణ వ్యవస్థ 'ఐరన్ డోమ్' అడ్డుకున్నప్పటికీ, మరికొన్ని హైఫాలో పలు జనావాస ప్రాంతాల్ని తాకాయని తెలిసింది. ఒక చిన్నారి సహా నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారని ప్రాథమిక సమాచారం. హెజ్బొల్లా రాకెట్ దాడుల్ని ఇజ్రాయెల్ భద్రతా బలగాలు (ఐడీఎఫ్) ధ్రువీకరించాయి. హైఫా పట్టణం శివారు ప్రాంతాల్ని మిస్సైల్స్ తాకాయని ఐడీఎఫ్ పేర్కొన్నది.

శ్మశానం కింద హెజ్బొల్లా సొరంగం!

హెజ్బొల్లా సభ్యులు ఉపయోగించే సొరంగాలను ధ్వంసం చేసినట్టు ఇజ్రాయెల్ సైన్యం(ఐడీఎఫ్) ఆదివారం తెలిపింది. వీటిలో ఒకటి శ్మశానం కింద ఉందని ఆరోపించింది. కిలోమీటర్ పొడవున ఉండే ఈ సొరంగాలను గుర్తించామని ఎక్స్‌లో ఒక వీడియోను పోస్ట్ చేసింది. ఈ సొరంగాల్లో కమాండ్ అండ్ కంట్రోల్ రూమ్స్, నిద్రించే గదులు, ఆయుధగారాలు ఉన్నట్టు ఐడీఎఫ్ వెల్లడించింది. ఓ సొరంగంలో డజన్ల కొద్దీ ఆయుధాలు, ఇతర సైనిక సామగ్రి ఉన్న వీడియోను ఎక్స్‌లో పోస్ట్ చేసింది. 'ఉగ్రవాదుల అండర్ గ్రౌండ్ సొరంగాలను మా దళాలు ధ్వంసం చేశాయి. అందులో వ్యూహాత్మకంగా శ్మశానం కింద కూడా ఒకటి ఉంది. హెజ్బొల్లా మనుషులు చనిపోయినా, బతికున్నా వారికి విలువ ఇవ్వదు' అని ఐడీఎఫ్ విమర్శించింది.

ఇరాన్ రసాయన ఆయుధాల అభివృద్ధి!

ఇజ్రాయెల్ సైనికులు, పౌరులపై ప్రయోగించేందుకు ఇరాన్ రసాయన ఆయుధాల్ని సిద్ధం చేసిందన్న వార్తలు వెలువడ్డాయి. ఔషధ తయారీలో రసాయన ఏజెంట్స్‌గా వాడే సింథటిక్ ఓపియాయిడ్లు, ఫెంటానేల్.. వంటి వాటితో ఇరాన్ రసాయన ఆయుధాల్ని అభివృద్ధి చేసిందని అమెరికా రక్షణ రంగ నిపుణుడు మాథ్యూ లెవిట్ వెల్లడించారు. శక్తివంతమైన రసాయన ఏజెంట్స్‌తో గ్రనెడ్లు, బాంబులను ఇరాన్ తయారుచేసిందని, వీటి ప్రభావానికి లోనైతే.. బాధితుల నాడీ వ్యవస్థ కొన్ని క్షణాల్లో దెబ్బతింటుందని తెలిపారు. ఇజ్రాయెల్ సైన్యం, పౌరులు లక్ష్యంగా ఈ రసాయన ఆయుధాల్ని ప్రయోగించేందుకు ఇరాన్ తయారు చేసిందని చెప్పారు. దీనిపై ఆయన రాసిన ఆర్టికల్ చర్చనీయాంశమైంది. ఇరాన్ రసాయన ఆయుధాల తయారీని తక్కువ అంచనా వేయడానికి వీల్లేదని హెచ్చరించారు. రసాయన ఆయుధాల నుంచి వెలువడే పొగను ఒకసారి పీల్చిగానే, బాధితులు వెంటనే స్పృహ కోల్పోతారని, ఇజ్రాయెల్ సైనికులు, పౌరులను బందీలుగా చేసుకోవడానికి ఇరాన్ వాడొచ్చునని చెప్పారు.

భగత్‌సింగ్ ఓ ఉగ్రవాది: పాక్

లాహోర్: బ్రిటిష్ వలస పాలకులపై వీరోచితంగా పోరాడి, ప్రాణ త్యాగం చేసిన భగత్ సింగ్ పట్ల పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రభుత్వం దురహంకారంతో వ్యవహరించింది. ఆయనను గౌరవించేందుకు తిరస్కరించింది. షద్మన్ చౌక్‌కు భగత్ సింగ్ పేరు పెట్టడాన్ని, ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకించింది. భగత్ సింగ్‌ను ఉగ్రవాదిగా పేర్కొనడంపై ఆమ్ ఆద్మీ పార్టీ ఘాటుగా స్పందించింది. దీనిపై పాకిస్థాన్‌ను వివరణ కోరాలని భారత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. బీజేపీ స్పందిస్తూ, పాకిస్థాన్ ఉగ్రవాదులకు ఆశ్రయమిస్తున్న విషయం అందరికీ తెలుసునని పేర్కొంది. భగత్ సింగ్‌ను అపఖ్యాతిపాలు చేయడం కోసం పాకిస్థాన్ నయవంచనకు పాల్పడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేసింది.



హారిస్‌ను అధ్యక్షురాలిని చేయాలి

బైడెన్ వైదొలగాలని డిమాండ్లు

వాషింగ్టన్, నవంబర్ 11: అధ్యక్ష ఎన్నికల్లో కమలా హారిస్ ఓటమి డెమొక్రటిక్ నేతల్ని తీవ్రంగా నిరాశపర్చింది. ఎన్నికల్లో ఓడిపోయినా.. కమలా హారిస్‌ను ప్రెసిడెంట్‌ను చేయవచ్చునని డెమొక్రటిక్ నేత ఒకరు వ్యాఖ్యానించారు. ట్రంప్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించేవరకు కమలాహారిస్‌కు పదవి అప్పగించాలని ఆమె మాజీ కమ్యూనికేషన్స్ వ్యవహారాల డైరెక్టర్ జమాల్ సిమన్స్ బైడెన్‌కు సూచించారు. 'జో బైడెన్ గొప్ప అధ్యక్షుడు. అయితే ఆయన చేసిన వాగ్దానం.. నెరవేర్చాల్సి ఉంది. తన పదవికి రాజీనామా చేసి, కమలా హారిస్‌కు బాధ్యతలు అప్పగించాలి. తద్వారా అమెరికాకు తొలి మహిళా అధ్యక్షురాలిగా కమలా హారిస్ నిలుస్తారు' అని అన్నారు. అమెరికా రాజ్యాంగం ప్రకారం, కొత్త అధ్యక్షుడిగా ట్రంప్ వచ్చే ఏడాది జనవరిలో బాధ్యతలు స్వీకరిస్తారు. దీనికి కొన్ని వారాల సమయముంది. అయితే బైడెన్ తన వాగ్దానాన్ని నెరవేర్చేందుకు మరో 30 రోజులు చాలని సిమన్స్ గుర్తుచేశారు.

'బాకూ'లో మొదలైన కాప్-29

బాకూ, నవంబర్ 11: 'పారిస్ ఒప్పంద' లక్ష్యాలు ప్రమాదంలో పడ్డాయని, మరోవైపు 2024 ఏడాదిలో ఉష్ణోగ్రతలు సరికొత్త రికార్డులను చేరుకోనున్నాయని ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేసింది. ప్రపంచానికి పెను సవాల్‌గా మారిన వాతావరణ మార్పులను కట్టడి చేసేందుకు ఐక్యరాజ్యసమితి నిర్వహిస్తున్న 'కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్' (కాప్)–29 సదస్సు సోమవారం అజర్ బైజాన్ రాజధాని 'బాకూ'లో ప్రారంభమైంది. ఐరాస చీఫ్ గుటెరస్, ప్రపంచ వాతావరణ సంస్థ చీఫ్ సెలెస్టే సాలో మాట్లాడుతూ, పర్యావరణ మార్పులపై ఆందోళన వ్యక్తం చేశారు. పారిస్ ఒప్పంద లక్ష్యాలను అందుకునేందుకు ప్రపంచ దేశాలు వీలైనంత తొందరగా కదలాలని, లక్ష్యాలను విడిచిపెట్టవద్దని సెలెస్టే సాలో ప్రపంచ దేశాలను కోరారు. నవంబర్ 11 నుంచి 22 వరకు జరగనున్న 'కాప్' సదస్సుకు వివిధ దేశాల నాయకులు, పర్యావరణ నిపుణులు హాజరవుతున్నారు. పారిస్ వాతావరణ ఒప్పందం అమలు, కాలుష్య నియంత్రణ కోసం వర్ధమాన దేశాలకు ఆర్థిక సాయం వంటి కీలక అంశాలు చర్చకు రానున్నాయి. సదస్సును ప్రారంభిస్తూ సాలో కీలక వ్యాఖ్యలు చేశారు. మంచు కరిగి, సముద్ర మట్టాలు పెరుగుతున్నాయని, అనూహ్యమైన వాతావరణ పరిస్థితులు ఏర్పడుతున్నాయని, దీంతో ప్రపంచవ్యాప్తంగా సమాజం, ఆర్థికరంగంపై తీవ్ర ప్రభావం చూపుతున్నదని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.

ఉక్రెయిన్‌తో యుద్ధం తీవ్రం చేయొద్దు

- ఫోన్‌లో పుతిన్‌కు ట్రంప్ సూచన
- ఖండించిన క్రెమ్లిన్ వర్గాలు

వాషింగ్టన్: ఉక్రెయిన్‌తో చేస్తున్న యుద్ధం మరింత తీవ్రతరం చేసుకోవద్దని రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు డొనాల్డ్ ట్రంప్ సూచించారట! యూరప్‌లో అమెరికా సైనిక ఉనికి గణనీయంగా ఉందన్న సంగతి పుతిన్‌కు గుర్తుచేశారట. ట్రంప్–పుతిన్ మధ్య ఫోన్ సంభాషణలు జరిగినట్టు అంతర్జాతీయ మీడియాలో సోమవారం వార్తా కథనాలు వెలువడ్డాయి. ఉక్రెయిన్ యుద్ధం సహా పలు విషయాలు ఇరువురు మధ్య ప్రస్తావనకు వచ్చినట్టు వార్తా కథనాలు పేర్కొన్నాయి. ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు ఎలా పలకాలన్నది వారిద్దరు మాట్లాడుకున్నారని 'వాషింగ్టన్ పోస్ట్' తెలిపింది. కాగా, వీటిని క్రెమ్లిన్ (పుతిన్ అధికార కార్యాలయం) వర్గాలు ఖండించాయి.

మేఘాల్లోనూ మైక్రోప్లాస్టిక్

- పర్యావరణాన్ని ప్రభావితం చేస్తుండొచ్చు
- శాస్త్రవేత్తల ఆందోళన



న్యూఢిల్లీ: భూమిని మొత్తం ఆక్రమించేసిన మైక్రోప్లాస్టిక్స్ మేఘాల్లోకీ చేరాయని, ఇవి పర్యావరణాన్ని సైతం ప్రభావితం చేస్తుండొచ్చని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు సంబంధించి అమెరికాలోని పెన్సిల్వేనియా స్టేట్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు చేసిన ఓ అధ్యయనంలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆకాశంలో మైక్రోప్లాస్టిక్‌లు మంచు కేంద్రక రేణువులుగా పని చేసి అసహజంగా మేఘాల ఏర్పాటుకు కారణమవుతున్నాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. సాధారణంగా మేఘాలు ఏర్పడే పరిస్థితులు లేకపోయినా మైక్రోప్లాస్టిక్‌లు మేఘాలు ఏర్పడేలా చేస్తాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని నిర్ధారించడం కోసం పరిశోధకులు నాలుగు రకాల మైక్రోప్లాస్టిక్‌లను ప్రయోగశాలలో పరీక్షించారు. ఇందుకోసం నీటి బిందువులను చల్లబరిచి మంచుగా మార్చారు. మైక్రోప్లాస్టిక్ లేని నీటి బిందువులు మైనస్ 38 డిగ్రీల సెల్సియస్ వద్ద గడ్డ కట్టగా, 50 శాతం మైక్రో ప్లాస్టిక్‌లతో కలుషితమైన నీటి బిందువులు మైనస్ 22 డిగ్రీల సెల్సియస్ వద్దనే గడ్డ కడుతున్నట్టు తెలుసుకున్నారు. కాబట్టి మైక్రో ప్లాస్టిక్‌లు మేఘాల నిర్మాణాన్ని ప్రభావితం చేస్తున్నాయని అర్థమవుతున్నదని శాస్త్రవేత్త ప్రొఫెసర్ ఫ్రీడ్‌మన్ తెలిపారు.